# కర్నూలు I నంద్యాల వార్త

7 జనవరి 2023 శనివారం పేజీలు 4




## నందవరం శ్రీ చౌడేశ్వరిదేవికి..
# దీపాలంకరణ సేవ

బనగానపల్లెరూరల్,జనవరి6, ప్రభాతవార్త:

బనగానపల్లె మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వి.ఎల్.ఎన్.రామానుజన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీ చౌడేశ్వరిదేవికి ఉదయం కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే సాయంకాలం శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్స వమూర్తిని అందంగా అలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని సహస్ర దీపాలంకరణతో మండపంలో నిలిపి దీపాలంకరణ సేవ మరియు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందవరం గ్రామ ప్రజలు మరియు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలు పేద ప్రజలకు వరం..!

**- నేడే ప్రారంభోత్సవం : ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్**



**నంద్యాల, జనవరి 6, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సొంతింటి కళ నేరవేరేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాష్ట్రంలోని టిడ్కో గృహాలు ఒక వరం అంటూ ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం టిడ్కో గృహాలను అకస్మికంగా తనిఖీచేసి పరిశీలించారు. నేడు రూ.850 కోట్లతో నిర్మించిన 8700 ఉచిత టిడ్కో గృహ ప్రవేశాల ప్రారంభోత్సవాన్ని పరిశీలించారు. నంద్యాల మున్సిపాలిటి పరిధిలోని ఎస్ఆర్‌బిసి కాలనీలో 3904, వైయస్ఆర్‌నగర్‌లో 3825, అయ్యలూరు మెట్టలో 2262 గృహాలు టిడ్కో ద్వారా నిర్మించామన్నారు. 10 వేల వైయస్ఆర్ జగనన్న నగర్ జి ప్లస్ త్రీ గృహా సముదాయాలను కూడ పరిశీలించారు. ఎస్ఆర్‌బిసి కాలనీలో 2000 గృహాలు, వైయస్ఆర్‌నగర్ లో 2000 గృహాలు కలిపి 4 వేల గృహాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం పరిశీలించడం జరిగిందన్నారు. నిర్మాణంలో ఉన్న గృహ సముదాయాలను, మంచినీటి వసతులను, వాటర్ సప్లయి, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, రోడ్లు, గ్రీనరీ, విద్యుత్ సౌకర్యం త్వరతగతిన పూర్తిచేసేలా అధికారులకు అదేశాలు ఇచ్చామన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించే విషయంలో మెప్మా డిపార్టుమెంటు, మిగిలిన అధికారులు సమన్వయం చేసుకొని రుణ మంజూరులో లబ్దిదారులకు సహాయం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిని కలిసి ప్రాజెక్టు వివరాలు వివరించామన్నారు. కార్యక్రమంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజశేఖర్, మున్సిపల్ కమిషనరు రవిచంద్రారెడ్డి, డిఈఈ గోపాలకృష్ణ, శంకర్, రామసుబ్బయ్య, వెంకటేష్‌నాయక్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్..



కర్నూలు, జనవరి 06,ప్రభాతవార్త : ఈవిఎం గోడౌన్ లో వున్న యం3 సిరీస్ వి.వి.ప్యాట్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావు పరిశీలించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవిఎం గోడౌన్ లో వున్న యం3 సిరీస్ వి.వి.ప్యాట్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావు, డిఆర్ఓ నాగేశ్వరరావు .తో కలిసి పరిశీలించారు, అనంతరం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్ లోని ఈవిఎం గోడౌన్ లో వున్న యం3 సిరీస్ వి.వి.ప్యాట్ లను మరియు స్ట్రాంగ్ రూమును ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పరిశీలించడం జరుగుతుందని అందులో భాగంగా ఈ రోజు కూడ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు .ఈవిఎం గోదాములో సిబ్బంది అందరూ మాస్కులు ధరించి వి.వి.ప్యాట్ ల నిర్వహణ పనులు చేపట్టేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిఆర్వో నాగేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళి, వివిధ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సిబ్బంది తదితరులున పాల్గొన్నారు.

# గ్రూప్-I పరీక్షల కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

**: మొబైల్‌ఫోన్లు అనుమతించబడవు**

**: జిల్లాలో 9651 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాసేందుకు 29 కేంద్రాలు ఏర్పాటు**

**కర్నూలు, జనవరి 06, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదిన నిర్వహించబోయే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణలో ఏలాంటి లోపాలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సర్వీసు కమీషన్ అధికారులు, లైజనింగ్ అధికారులు మరియు ఛీఫ్ సూపరింటెండెంట్లు తదితరులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షలుఎంతో ప్రాముఖ్యత ఉన్న పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో ఎటువంటి లోపాలకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పరీక్షల నిర్వహణకు నియమించిన లైజనింగ్ అధికారులు పరీక్షా సమయంలో పరీక్షలు వ్రాసే గదులను పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో 9651 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాసేందుకు 29 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పేపరు-1, మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పేపరు -2 పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా పరీక్షా సమయం పూర్తయ్యేవరకు అభ్యర్థులను బయటికి వెళ్లేందుకు అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఏలాంటి మొబైల్ ఫోన్లు గానీ, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, క్యాలుక్లేటర్ మరియు ఎటువంటి ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి నాగేశ్వరరావు, ఏఎస్‌పి నాగబాబు, సర్వీసు కమీషన్ అధికారులు, లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అంబాభవాని(బగళాంబ)దేవి..
# రథోత్సవం..!



**అర్లబండ(కోసిగి), జనవరి 6, ప్రభాతవార్త :** కోసిగి మండల పరిధిలోని అర్లబండ గ్రామంలో శుక్రవారం సాయంత్రం బగళాంబదేవి(అంబాభవాని) రథోత్సవం కన్నుల పండువగా జరిగింది.. ఉదయం నుండే మఠం పీఠాధిపతులు శ్రీ మఠ్రిస్వామి తాత, రత్నమ్మ అవ్వలు, అంబాభవాని అమ్మ వారికి క్షీరాభిషేకం, జలాభిషేకం చేసి ఆకుపూజ, నైవేద్యంతో అర్చన నిర్వహించి భక్తులకు అన్నదానం చేసారు. సాయంత్రం ప్రజలు, భక్తులు, జయ జయ ధ్వనులు పలుకుతుండగా వెండికొండ దిగువ ప్రాంతంలో ఉన్న తేరు మైదానంలో రథోత్సవం కొనసాగింది. ఈ సందర్భంగా కోసిగి ప్రజలే కాక, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని భక్తి శ్రద్దలతో కొలిచారు. అంతకు ముందుగా మధ్యాహ్నం మండల వైకాపా ఇంచార్జ్ మురళీమోహన్‌రెడ్డి, నాయకులు ఎంపీపీ లవకుశ ఈరన్న, బెట్టప్పగౌడ్, నాడుగేని నరసింహులు, మాణిక్యరాజు, ఉరుకుంద ఈరన్న ట్రస్ట్ బోర్డు సభ్యులు నరసింహులు, రజితాద్రిపై ఉన్న అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా మఠం పీఠాధిపతి మఠ్రిస్వామి తాత వారిని అక్షింతలతో దీవించి ఆశీస్సులిచ్చారు..అలాగే మాజీ సర్పంచ్ గౌళ్ల పక్కిరమ్మ, వైకాపా గ్రామ నాయకులు గౌళ్ల పరుశురామ్, కాసీమ్, వెంకటేశ్‌లు వైకాపా నాయకులకు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.. ఈ రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిఐ ఎరిసావలి ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బందోబస్తును నిర్వహించారు..



# జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగ వంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు**



**గూడూరు,జనవరి 6, ప్రభాతవార్త :** జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాలలో జరిగే జగనన్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగ వంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాలకు వచ్చే ఇసేవ సేవలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయాలలో సేవలను మెరుగుపర్చేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సచివాలయాలలో బయోమెట్రిక్ హాజరు పరుస్తున్నామని వాటిని సద్వినియోగం చేయాలన్నారు. సచివాలయాల ద్వారా రేషన్ కార్డులు, ఆయుస్మాన్ భారత్ ఎంత వరకు లబ్దిదారులకు ఇచ్చారని కలెక్టర్ ప్రశ్నించారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు కొత్తగా 13 మందికి రేషన్ కార్డులు, ఆరు మందికి ఆయుస్మాన్ భారత్ కార్డులందించామన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు అన్ని రకాల సేవలందించాలన్నారు. తాహ శీల్దార్ శివరాముడు, ఎంపిడివో మాధవీలత, హౌసింగ్ ఎఇ సుబ్బయ్య, ట్రాన్స్‌కో ఎఇ శాస్త్రీ, విర్వోలు తిమ్మన్న, గోపాల్, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద సంకేతాలున్న.. గర్భిణిలకు శ్రద్ద వహించాలి

**- యర్రగుంట్ల పిహెచ్‌సి, బత్తలూరు విలేజ్ హెల్త్‌క్లినిక్ తనిఖీలు : డిఎంఅండ్‌హెచ్ఓ**

**నంద్యాల హాస్పటల్, జనవరి 6, ప్రభాతవార్త:** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు గర్భవతులు ప్రమాదం నుంచి కాపాడేందుకు వైద్యశాఖ సిబ్బంది నిరంతరం కృషిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం శిరివెళ్ల మండలం యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బత్తలూరు గ్రామంలో ఉన్న విలేజ్‌హెల్త్ క్లినిక్‌లను అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ప్రమాద సంకేత లక్షణాలున్నటువంటి గర్భవతులకు అందుతున్న సేవల గురించి, వివరాల గురించి అడిగి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని వసతులున్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రినందు మాత్రమే ప్రసవం జరిగే విధంగా జాగ్రత్త వహించాలని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవానికి వచ్చిన సమయంలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సురక్షితమైన ప్రసవాన్ని జరిపి ప్రభుత్వం అందజేసే ఆర్థికలబ్ది అందజేయాలని అదేశించారు. పుట్టిన బిడ్డకు వెంటనే వ్యాధి నిరోధక టీకాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పిహెచ్‌సిలో గర్భిణి స్త్రీల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని బత్తులూరి గ్రామంలో విలేజ్ హెల్త్‌క్లినిక్ నందు నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని తనిఖీచేశారు. సిబ్బందికి, వైద్యులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.



# గాంధీజీ కలలను సాకారం చేసిన జగన్

**- రూ.23లక్షలతో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ ప్రారంభం : మంత్రి గుమ్మనూరు జయరాం**



**ఆస్పరి,జనవరి 6,ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మ గాంధీజీ కలలను గ్రామస్వ రాజ్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి గ్రామ సచివాలయాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి సాకారం చేశారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిగిలి గ్రామంలో సర్పంచ్ జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణల ఆద్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామశివారు నుండి వైసిపి నాయకులు మంత్రి జయరాంకు బాణాసంచా పేలుస్తూ తప్పెట్లు, పూలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిగిలి గ్రామానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.10కోట్ల45 లక్షలను నవరత్నాల ద్వారా అందచేశారన్నారు. అలాగే రూ.23లక్షలతో నూతనంగా నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. ముందుగా సచివాలయ సిబ్బంది, వాలంటరీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి ప్రతి పథకం అందేలా సిఎం జగనన్న ఏర్పాటు చేశారన్నారు. అలాగే గ్రామ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేసి సిసిరోడ్లు వేయాలన్నారు. సచివాలయం ద్వారా రూ.20లక్షలు మంజూరయ్యాయని ఈ నిధులతో గ్రామంలో ప్రధానంగా ఉన్న సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాలుక ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, ఆస్పరి, ఆలూరు మండల కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, మాజీ మండల కన్వీనర్లు రామాంజినేయులు, సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, జిల్లా కెడిసిసి డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, కోకన్వీనర్ పురుషోత్తమ్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు వెంకన్న, ఆలూరు మాజీ జడ్‌పిటిసి రామ్‌భీమ్‌నాయుడు, సర్పంచ్ హరికృష్ణ, బసవరాజు, తిమ్మప్ప, ప్రకాష్, రాజన్నగౌడ్, మునిస్వామి, లక్ష్మప్ప, శివ, పాండు, నాయుడు, రాజన్న, బిటెక్ వీరబద్రి, శివకోటి తదితరులున్నారు.

# వైసీపీ నాయకుల కన్నుపడితే.. కబ్జానే..!





**పత్తికొండ,జనవరి6,ప్రభాతవార్త:** పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామ పరిధిలో ఉన్న 150/3 సర్వేనంబర్‌లో 5.05ఎకరాల మాల నారాయణ భూమి పూర్వ కాలం నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2015 భూవివాదం జరుగుతున్న కోర్టులో ఉన్న వైసీపీ నాయకులు దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు టెంపరింగ్ చేస్తూ అధికార పార్టీ నాయకుల పేర్లనుచేర్చి భూవివాదాలకు, ఘర్షణలను రెవెన్యూ అధికారులు ప్రోత్సహిస్తున్నారన్నారు. రక్షకభటులు ప్రేక్షక పాత్ర పోషిస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దళితులు పోలీస్ స్టేషన్‌కు వస్తే దళితులను చిన్నచూపు చూస్తు కేసు కూడా నమోదు చేయడం లేదని దళిత సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి దళితులు వస్తే ఫిర్యాదును స్వీకరించడానికి కూడా కరువైయ్యారన్నారు. దళితుల భూములు తాతలముత్తాతల కాలం నుండి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికి వైసీపీ నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారు. ఆ భూమి 2015 నుండి వివాదస్పందంలో ఉన్న దళితులకు కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ ఉన్నప్పటికి కోర్టును తప్పుదారి పట్టించి రెవెన్యూ అధికారుల సహాయంతో టెంపరివరీ ఇంజక్షన్ తెచ్చుకున్న వైసీపీ నాయకులు దౌర్జన్యంగా పొలంలోకి వెళ్లి దళితులను వెంటాడి వేటాడి కర్రలతో, కట్టెలతో, పైపులతో చంపాలని ఉద్దేశ్యంతో పరిగెత్తించారు. పొలంలో ఆయుధాలు దాచిపెట్టి కాపుకాసి దాడి చేసి రక్తగాయాలు చేశారు. వారి నుండి దళితులు తప్పించుకుని ప్రాణభయంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసి వైద్య చికిత్స కోసం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి ప్రాథమిక చికిత్స చేయించుకోని మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. దళిత సంఘాలు అటెంట్ మర్డర్ కేసు, 307 కేసును నమోదు చేయకపోతే ఎస్పీ కార్యాలయాన్ని దళిత సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామన్నారు. ఇలాంటి వారి పై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇలాంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## మిడుతూరు మండలంలో.. పర్యటించిన కలెక్టర్

**మిడుతూరు,జనవరి 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని పర్యటించి నిర్మాణంలో నెలకొన్న అభ్యంతరం గల ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. దానికి సంభంధించిన వివరాలను సానికులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో జగనన్న కిట్లను విద్యార్థులకు అందజేసి మధ్యాహ్న భోజనం అహార పదార్థాలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన మిడుతూరులో గ్రామ సచివాలయాన్ని సంధర్శించి భాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే రోళ్ళపాడు గ్రామ పరిధిలో జగనన్న కాలనీని కలెక్టర్ పరిశీలించి ఇంకా గృహాలు కావాలంటే అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని స్తానికులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యం.పి.పి.వెంకటేశ్వరమ్మ, యం.పి.డి.ఓ. జి.ఎస్.ఎస్.రెడ్డి, తహాసిల్దార్ సిరాజుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.



# బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత..

**- పొలం విషయంలో అధికార పార్టీ నాయకుల జోక్యం**

**- పోలీస్‌స్టేషన్ వద్ద భార్య ధర్నా - భర్తను విడిపించుకున్న భార్య**



**బండిఆతత్మకూరు, జనవరి 6, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పరిధిలోని బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక అధికార పార్టీ నాయకుడి చోరవతో ఒక బాధితున్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్ఐ ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారు. చివరకు భార్య, బంధువులు 40 మంది వరకు స్టేషన్ వద్దకు వచ్చి నిరసన, ధర్నా చేయడంతో ఆ వ్యక్తిని విడిచిపెట్టిన సంఘటన బండిఆత్మకూరు పోలీస్టేషన్‌లో జరిగింది. బాధిత మహిళా మౌలాబి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పరమటూరు గ్రామంలో మాద్దైన తనభర్త దూదేకుల బాలకాశీం పొలంను అహమ్మద్ వుశేన్ దౌర్జన్యంగా సాగుచేసుకుంటున్నారు. ఈవిషయంపై దూదేకుల బాలకాశీం పొలం వద్దకు వెళ్లి అహమ్మద్ వుశేన్‌ను నిలదీశారు. దీంతో అహమ్మద్ వుశేన్ బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఎస్ఐ బాబు జోక్యం చేసుకొని దూదేకుల బాలకాశీంను స్టేషన్‌కు పిలిపించుకొని తీవ్రంగా కొట్టినట్లు భార్య మౌలాబి అరోపిస్తుంది. సుమారుగా గ్రామం నుంచి 40 మంది వరకు ట్రాక్టర్‌లో పోలీస్‌స్టేషన్‌కువచ్చి నిరసన, ధర్నా చేపట్టారు. ఎస్ఐ వచ్చిన వారిని కూడ బేదిరిస్తు వీరిని కూడ లోపల వేయండి మీ బుద్దినచోట చెప్పుకోండి అంటూ వచ్చిన వారిపై చిందులేశారు. దీంతో ఆగ్రహించిన ఖాశీం భార్య, బంధువులు స్టేషన్ ముందే కూర్చున్నారు. నాభర్తను పైసలు తీసుకొని కొట్టారని విడిచిపెట్టేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ మౌలాబి, బంధువులు దీక్ష చేపట్టారు. దీంతో దిగివచ్చిన ఎస్ఐ బాబు దూదేకుల బాలకాశీంను విడిచిపెట్టారు. సివిల్ పంచాయితీ కేసుల్లో ఎస్ఐ జోక్యం చేసుకోవడంతో పలు విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. మహిళలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని అరోపిచారు. ఒక అధికారపార్టీ నాయకుడి చోరవతో ఈతతంగమంతా నిర్వహించారన్న అరోపణలు ఎస్ఐ మూటకట్టుకోవడం విశేషం. ఎస్ఐ బాబును ప్రభాతవార్త వివరణ అడగ్గా వారివురు పొలం విషయంలో తగువులాడుకున్నారని వీరిద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సర్ధిచెప్పానని వివరిణ ఇచ్చారు.

## నందికొట్కూరులో.. నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు

**నందికొట్కూరు,జనవరి 6,ప్రభాతవార్త:** జగనన్న సంక్రాంతి సంభరాలు పురష్కారించుకొని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆదేశాల మేరకు నందికొట్కూరులో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లుగా కర్నూలు, నంద్యాల జిల్లా శాప్ కో-ఆర్డీనేటర్లు పెరుమాళ్ళ శ్రీనాథ్, స్వామిదాసు రవికుమార్ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బాడ్మింటెన్, క్రీడాంశాలలో ఈ నెల 13,14 తేదీలలో నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లుగా వారు తెలిపారు. ప్రతి క్రీడాంశంలో మొదటి బహుమతి రూ.60వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాలుగవ బహుమతి రూ.20వేలునగదు ఇవ్వబడునని వారు తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజులేదని, ఎంట్రీలు స్వీకరించుటకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం వరకు, 10వ తేదీన ఫిక్సర్స్ డ్రా తీయబడునని తెలిపారు. నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల నుండి 18 ఏళ్ళు పైబడిన (మెన్)క్రీడాకారులు పాల్గొనవచ్చునని తెలిపారు.



## ప్రమాదాల నివారణకు 7 చోట్ల రక్షణకు చర్యలు - జిల్లా ఎస్పీ



హైవేపై ప్రమాదాలు జరగకుండా రక్షణకు ఏర్పాట్లు చేసిన బారికేడ్లు

**నంద్యాల, జనవరి 6, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా కేంద్ర పరిధిలో తరుచు ప్రమాదాలు జరుగుతునా న్నయని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గురించి నిఆరణ కోసం ప్రతే ్యక చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ సిఐ నరేష్‌బాబు, తాలుక ఎస్ఐ గంగయ్యయాదవ్‌లు శుక్రవారం తెలిపారు.నంద్యాల హైవే పరిధిలోను, పట్టణంలోను పలుచోట్ల ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించారు. నంద్యాల నుంచి కర్నూలు వెళ్లె దారిలో కుందూబ్రిడ్జి దగ్గర, వెంకటేశ్వరపురం ఫ్లైఒవర్ దిగు ప్రదేశంలో,శాంతిరాం ఆసుపత్రి వద్ద, హైవేలో గల చాబోలు ఎక్స్‌రోడు వద్ద, అయ్యలూరు మెట్ట జంక్షన్ వద్ద విజయమిల్క్‌డైరీ వద్ద ఆత్మకూరు వెళ్లు దారిలో చెరువుకట్ట వద్ద ప్రమాద హెచ్చరికలను జారీచేశారు.వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఎస్‌టైపు బారీకెడ్లను స్పీడ్ బ్రేకర్లను, లైటొసిగ్నల్స్ లైట్‌నుప్రమాదం జరిగే చోట పోటోలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారు. తాగి వాహనాలు నడపవద్దని అతివేగంగా నడపరాదని, ఓవర్‌లోడ్‌తో వెళ్లకూడదని, ఆటోలలో డ్రైవర్‌కు ఇరుపక్కల కూర్చోరాదని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పోలీసులు కోరారు.

## నైట్ విజన్



**కర్నూలు విద ్య, జనవరి 6, ప్రభాతవార్త:** పదవ తరగతి క్లాస్‌లో 100 ఉత్తీర్ణత సాధించుటలో భాగంగా నైట్ విజన్ కార్యక్రమం నిడిజూర్‌లో నిర్వహించారు. డిఇఓ, హెచ్ఎం నిడ్జూర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.విద్యార్థులు ఇంటిదగ్గర ఎలా చదువుచున్నారో తెలుసుకోవడానికి ఈకార్యక్రమ ఉద్దేశ్యం తల్లిదండ్రులతో సంప్రదించి వారి పిల్లలు సరిగా చదివేటట్టు చూడడ, రాత్రి పదిగంటల వరకు నేర్చుకొని మళ్లి ఉదయం 5 గంటలకు లేచి చదువుకోవాలి 10వ తరగతి విద్యార్థులు. టివిలు, సెల్‌ఫోన్స్ వాడకుండా తల్లిదండ్రులు జాగ్రత పడాలి. నైట్ విజన్ వల్ల విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుంది. నిడ్జూర్ గ్రామంలో విద్యార్థులకు ఎలా పరీక్షలకు సంసిద్దం కావాలో డిఇఓ,హెచ్ఎం ఉపాధ్యాయులు తెలియజేశారు.

## సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మారథం

-ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించిన ఎమ్మెల్యే - శిల్పా



**నంద్యాల, జనవరి 6, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన విధానాన్ని చూసి సచివాలయ వ్యవస్థ పనితీరు చూసి దేశంలోని అన్నిరాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయంటే జగనన్న పాలన సంక్షేమాభివృద్ధికోసమే ముందుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల మున్సిపాలిటి పరిధిలోని 31వ వార్డు మూలసాగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 72వ రోజు పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ శేగురెడ్డి అనురాధ, వైసీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి గడప గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్దిదారులకు అందజేశారు.శిల్పా మాట్లాడుతూ విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారని విద్యార్థుల కోసం పాఠశాలల రూపురేఖలు మార్చారని వైద్యశాలలను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఏర్పాటుచేశారని ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలను గుర్తించినముఖ్యమంత్రి వారి కోసం నవరత్నాలనే కాకుండా కొత్త హామిలను నేరవేర్చారన్నారు. గతంలో టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలకుమాత్రమే సంక్షేమ పథకాలు అందించి ప్రజలను మాటలతో మోసం చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్దిచెబుతారని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, కమిషనరు రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరునికి వైభవంగా అన్నాభిషేకం



**మహానంది, జనవరి 6, ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రంలో శివకోటి, ఆరుద్రోత్స వ పురష్కరించుకొని అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని అధ్వర్యంలో ప్రతే ్యక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పీఠార్చన, మహాన్యాసపఠనం, ఏకాదశ రుద్రం, అన్నసూక్త పారాయణంతో అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయదాతలుగా రాంమోహన్‌రావు దంపతులు సుబ్రమణ్యా హరికృష్ణ దంపతుల సహకారంతో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. క్షేత్రానికి అధిక సఖ్యలో భక్తులు తరలివచా ్చరు. భక్తులకు అన్నదానప్రసాదాలు అందించారు.

## మారెమ్మగుడిలో హుండీ చోరీ

**ప్యాపిలి జనవరి6(ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎస్.రంగాపురం గ్రామంలోని మారెమ్మ ఆలయంలో హుండీని పగులకొట్టి చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం హుండిని పగులకోట్టి చోరీ జరిగినట్లు ప్రజలు గుర్తించారు. హుండి చోరీకి పాల్పడిన గ్రామానికి చెందిన ఆచారి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రజలు దేహశుద్ది చేశారు. అనంతరం నిందితున్ని పోలీసులకు అప్పగించారు. ప్రజల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎన్నికల తుది ఓటర్ల జాబితా



**కర్నూలు, జనవరి 06,ప్రభాతవార్త :** అన్ని తహాశీల్దార్ కార్యాలయలలో పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా అంశంపై రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం వారు డిసెంబర్ 30వ తేదీన పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా జారీ చేశారని, దానికి సంబంధించి జనవరి 02 వ తేదీన సీఈఓ రాష్ట్ర స్థాయి లో జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారని, కర్నూలు జిల్లాలో కూడ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా అంశంపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు అందుకు అనుగుణంగా ఈరోజు సమావేశం నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలియచేశారు.. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారము కడప, అనంతపురము మరియు కర్నూల్ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు ఎన్నికలు జరుపుటకు అవసరమైన కర్నూలు జిల్లా తుది ఓటరు జాబితా అన్ని తహాశీల్దార్ కార్యాలయాలలో ప్రచురించడం జరిగిందని, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా గుర్తింపు పొందిన రాష్ట్ర మరియు జాతీయ రాజకీయ పార్టీలకు తుది ఓటరు జాబితా ప్రతులను ఎన్నికల ఓటర్ల నమోదు అధికారి జిల్లా రెవెన్యూ అధికారి, అనంతపురము వారు ఇవ్వడము జరిగినది అని అన్నారు. మొదటి మరియు రెండవ విడతల ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా 66 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలకు గాను 61,684 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 42,097 మంది కాగా 19,586 మంది స్త్రీలు మరియు ఇతరులు ఒక్కరు ఉన్నారని అదే విధంగా 25 ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలకు గాను 5,364 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని అందులో 2,983 మంది పురుషులు కాగా స్త్రీలు 2,381 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు, ఎలక్షన్ సూపరిడెంట్ మురళి, వైఎస్సార్, టిడిపి, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సమస్యల పరిష్కారమే ధ్యేయం...జిల్లా ఎస్పీ...



**కర్నూలు క్రైమ్,జనవరి,06,ప్రభాతవార్త ః**-పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోరకు శుక్రవారం కర్నూలు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ జిల్లా పోలిస్ కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు.జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలసు సిబ్బంది మొత్తం 28 మంది ఇతర వ్యక్తిగత స్పౌఫ్ చిల్డ్రన్స్ మెడికల్ సమస్యలు మరియు రిక్వెస్ట్ బదీలీల గురించి జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు.జిల్లా సిబ్బంది సమస్యలను విని వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు.సిబ్బదికి యొక్క ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులును ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిపిఒ ఏఓ సురేష్ బాబు స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ తదితరులు పాల్గోన్నారు.

## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి- ఏఓ

**జూపాడుబంగ్లా, జనవరి 6 ప్రభాతవార్త :** ఎరువులు,పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి క ృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని మన గ్రోమోర్ సెంటర్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మనగ్రోమోర్ కేంద్రంలో క్రయ విక్రయాల బిల్లు పుస్తకాలు, రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణంలో నిల్వవున్న ఎరువులను తనిఖీ చేశారు. నిషేదిత ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల క ృత్రిమ కొరత స ృష్టించి..అధిక ధరలకు అమ్మితే దుకాణం లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ఎరువులు అమ్మకాలు చేసేటప్పుడు రైతుల ఆధార్ నెంబర్ నమోదు చేసుకుని,డీబీటీ ప్రకారం అమ్మకాలు జరపాలన్నారు. బయోమెట్రిక్ విధానంతోనే రైతులకు ఎరువులు విక్రయిస్తూ తప్పకుండా రశీదు ఇవ్వాలన్నారు. అదే విధంగా నందికొట్కూరు సమీపంలోని సుభాని ప్రాసింగ్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో వెల్లడైన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందన్నారు.

## సెబ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలు వేలం

:- వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.13.72 లక్షలు ఆదాయం..

**కోసిగి, జనవరి 6, ప్రభాతవార్త :** అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన వివిధ ద్విచక్ర వాహనాలను సెబ్ నంద్యాల జిల్లా సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్, వేలం పాటలకు ఇంచార్జీ శ్రీధర్‌రావు సమక్షంలో గురువారం సెబ్ అధికారులువేలం వేసారు.. స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయ ఆవరణంలో సెబ్ సిఐ సృజన్‌బాబు ఆధ్వర్యంలో అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన వాహనాలలో 109 ద్విచక్ర వాహనాలను వేలం వేయడం జరిగింది..ఈ వేలం పాటలను రాత్రి పొద్దుపోయేదాక నిర్వహించారు..వాహనాలను వేలం పాటలలో కొనుగోలు చేసేందుకు వందలాది మంది పాల్గొని వేలం పాటలు పాడారు..కాగా ఈ వేలం పాటల్లో 107 ద్విచక్ర వాహనాలను వేలం పాటల్లో పాటదారులు కైవసం చేసుకున్నారు.ు.. మిగతా రెండు వాహనాలకు సంబందించి వాహనాల విలువ అధికంగా ఉండడంతో వాటిని వేలంలో తీసుకునేందుకు పాటదారులు ముందుకు రాలేదు.. ఇక ఈ వేలం పాటలకు సంబందించి జిఎస్‌టితో కలిపి ప్రభుత్వానికి రూ.13.72 లక్షలు వచ్చినట్లు అధికారులు తెలిపారు..ఈ వేలం కార్య క్రమంలో సెబ్ స్వాడ్ సిఐ రాజశేఖర్‌గౌడ్, సెబ్ ఎస్ఐ రవికుమార్, సెబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

## వీఆర్వో,వీఆర్ఏలను అవమానించిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

**బేతంచెర్ల,జనవరి6,ప్రభాతవార్త:** ఎమ్మిగనూరులో భూహక్కుల పత్రాల పంపిణీ కార్యక్రమంలో వీఆర్వో,వీఆర్ఏలను అవమానించిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి క్షమాపణ చెప్పాలని నంద్యాల జిల్లా వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేష్,సీఐటీయు నాయకులు యల్లయ్య ,వై.బి.వెంకటేశ్వర్లులు శుక్రవారం డిమాండ్ చేశారు.స్థానిక సీఐటీయు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో మూలస్తంభాలుగా పనిచేస్తున్నటువంటి వీఆర్వో,వీఆర్ఏలను ప్రజాప్రతినిధి అయిన బాధ్యత కలిగిన శాసనసభ్యుడు చెన్నకేశవరెడ్డి అవమానించడం దారుణమన్నారు.వీఆర్ఏ,వీఆర్వోలు గ్రామాలలో భూసర్వేలు,ప్రభుత్వం చేపట్టే అనేక రకాలైన రైతు,ప్రజా సంబంధిత భూ సమస్యల పరిష్కా రంలో కీలకపాత్ర వహించడం జరుగుతుందన్నారు.ఇలాంటి వారిని ఎమ్మెల్యే అవమానించడం తగదన్నారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే తన మాటలను వెనక్కు తీసుకోవాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలు,ఉద్యోగ సంఘాలను కలుపుకుని ఆందోళనలను చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏల జిల్లా కార్యదర్శి భూపాల్,మండల అధ్యక్షులు ఎస్.కె.బాషా,పలువురు వీఆర్ఏలు,సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నా సైకో పాలనను సాగనంపండి

**బేతంచెర్ల,జనవరి6,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలకు రాజ్యాంగం ద్వారా లభించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైకో పాలనను సాగనంపాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి,మండల టీడీపీ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్,నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి రూబెన్‌లు పిలుపునిచ్చారు.శు క్రవారం పట్టణంలోని 9వ వార్డు నందు స్థానిక నాయకులు ఆవుల రామకృష్ణ,చింతకాయల విజయ్ కుమార్,తిమ్మరాజు, టైలర్ రాముడుల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజలకు వచ్చినటువంటి ప్రాథమిక హక్కులైన వాక్ స్వాతంత్ర్యం,స్వేచ్ఛ వంటి అంశాలను జీవోల పేరుతో రాష్ట్ర ముఖ ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలరాసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమైన చర్యని వారన్నారు.ఇలాంటి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పి ఇంటికి సాగనంపాలని వారు కోరారు.అనంతరం 9వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తి,నాగేశ్వరరెడ్డి,పలువురు స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటలకు ఈక్రాప్ ఖచ్చితము - 15లో పూర్తి చేయండి-జెడిఎ

**కలుగొట్ల(కోవెలకుంట్ల),జనవరి 6,ప్రభాతవార్త :** రైతులు పండించిన పంటలకు ఈక్రాప్ ఖచ్చితమని జిల్లా వ్యవసాయ అదికారిమోహన్‌రావు చెప్పారు. శుక్రవారము ఉదయం జెడిఎ మోహన్‌రావు కోవెలకుంట్ల మండలంలోని కలుగొట్ల గ్రామంలోని అర్బికేలను అకస్మికంగా తనికీ చేశారు.అనంతరము అర్బికేలోని ఈక్రాప్ నమోదు పరిశీలించారు. అటుతర్వాత అక్కడున్న శనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భముగా ఆయన రైతులతో మాట్లాడుతూ రబీలోరైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈక్రాప్ చేయించుకోవాలని ఇది ప్రస్తుతము చాలా ఖచ్చితమని చెప్పారు. రైతులకు కిసాన్ యోజన్, రైతు భరోసా వర్థించాలని ఈక్రాప్ ఖచ్చితమని చెప్పారు.ఇప్పటి వరకు ఈక్రాప్ చేయించుకోని రైతులు ఈనెల 15 లోగా ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎడిఎ కృష్ణమోహన్‌రెడ్డి, ఎఓ నిరంజన్ సిబ్బంది పాల్గొనా న్నరు.

## రైతుల పశుగ్రాసం కాపాడెందుకు మళ్ల పొదులు తొలగింపు

**అమడాల(కోవెలకుంట్ల),జనవరి 6,ప్రభాతవార్త :** వ్యసాయ సీజన్ కావడముతో రైతుల పశుగ్రాస పరిరక్షణ కోసం రోడ్డు వెంట ముళ్ల చెట్లను తొలగించామని అమడాల సర్పంచు బోయబాలమది ్దలేటి చెప్పారు. కోవెలకుంట్ల మండలంలోని అమడాల మెట్ట వద్ద నుండి గ్రామంలో పంచాయతీరాజ్ రోడ్డు ఉంది. అయితే రోడ్డు చుట్టు పంట పొలాలు ఉండటముతో మళ్ల చెట్లు విపరీతము ఉన్నాయి. దీనితో వ్యవసాయ పనుల నిమిత్తము పొలాలకు వెల్లి ఎద్దుల బండ్లతో పాటు ట్రాక్టర్లకు ఎదురుగా వచ్చిన వాహనాలకు పక్కకు తప్పుకోవడానికి వీలు లేకుండా ముళ్ల చెట్లు ఉండటముతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనితో పాటు పశుగ్రాసం ఇళ్లకు తరలిస్తుంటే ఈచెట్లుకు గ్రాసం అంతా అత్తుకుని పోతుందని రైతులు బాదపడుతుంటే యుద్ద ప్రాతికన జెసిపితో ముళ్ల చెట్లను శుక్రవారము తొలగించామని చెప్పారు.

## జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే అరాచకమే-టిడిపి



**జూపాడుబంగ్లా, జనవరి 6 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి మరోసారి అవకాశమిస్తే ఆరాచకం,దౌర్జన్యాలు పెరిగిపోతాయని క్లస్టర్ ఇన్‌చార్జ్ గిరీశ్వరరెడ్డి అన్నారు. ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో టిడిపి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నిత్యం అబద్దాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, రైతులు , నిరుద్యోగులను ఆదుకోవాల్సి న ప్రభుత్వం అన్యాయం చేస్తుందానా న్నరు. పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ప్రభుత్వం పెంచేస్తున్న చార్జీలు, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోవటం లాంటి ఆంశాలను తెలుగు తమ్ములు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో రవికుమార్, సుధాకర్,శాలు, సుబ్బయ్య, వెంకటేశ్వరరావు (బాబు) కుమార్,నాగేష్ రంగారెడ్డి,మాభాష, స్వాములు పాల్గొన్నారు.

## నేడు వైద్య పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం....

**కర్నూలు క్రైమ్,జనవరి,06,ప్రభాతవార్త ః-** కర్నూలు మెడికల్ కళాశాల అల్యుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో శని ఆదివారాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ ఎస్ మునిరుద్దీన్ అహమ్మద్ పేర్కొన్నారు.శుక్రవారం వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడాతూ దేశ విదేశాల్లో కర్నూలు మెడికల్ కళాశాల ప్రారంభం బ్యాచ్ 1956 నుంచి నేటి వరకు ఈ కళాశాలో విద్యను అభ్యసించిన వారందరితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎమ్పీ డాక్టర్ సంజీవ్ కుమార్ హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి విజయవాడ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బి సాంబశివారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు.ఇక్కడ చదవి దేశవిదేశాల్లో స్థిరపడిన వైద్యులు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ట్రెజరర్ డాక్టర్ బాలమద్దయ్య డాక్టర్ ప్రేమకిశోర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ డాక్టర్ మహేంద్ర తదితరులు పాల్గోన్నారు.

## సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

**ప్యాపిలి జనవరి6(ప్రభాతవార్త):** సచివాలయ ఉద్యోగులు విధుల నిర్వహణలో సమయ పాలనను పాటించాలని డిఎల్‌డివో జనార్ధన్‌రావు కోరారు. మండల కేంద్రమన ప్యాపిలి పట్టణంలోని సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో సిబ్బంది ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉద్యోగులు విదులను నిర్వహించాలని, ఏ పనికి వెళ్ళినా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాలకు ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలని ఆదేశించారు. సచివాలయాలలో సరిగ్గా పని చేయడం లేదని పిర్యాదులు వస్తున్నాయని, సక్రమంగా పని చేయని సిబ్బంది కఠినచర్యలు తీసుకఒటామని హెచ్చరించారు. సమయపాలన పాటించని ఉద్యోగులకు నోటిసులను జారీ చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందించే విధంగా సచివాలయ సిబ్బంది పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడివో ఫజిల్‌రహిమాన్, ఈవోఆర్డీ బాలక్రిష్ణ పాల్గోన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**వెలుగోడు,జనవరి6,ప్రభాతవార్త :** నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏడిఏ ఆంజనేయులు,ఏవో సునీత ఎరువుల దుకాణాదారులను హెచ్చరించారు.పట్టణంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు.ఎరువుల దుకాణాంలోని రికార్డులను వ్యవసాయాధికారులు పరిశీలించారు.వ్యసాయాధికారులు ఎరువుల దుకాణాదారులకు పలు సూచనలు ఇచ్చారు.

## గుప్తనిధుల కోసం తవ్వకాలు



**ప్యాపిలి జనవరి6(ప్రభాతవార్త ):** మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసినట్లు ప్రజలు తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఆలయంలో ద్వజస్థంభాన్ని తీసివేసి గుంతలు తవ్వి గుప్తనిదుల కోసం పూజలు చేసినట్లు పేర్కోన్నారు. గత మూడు రోజుల క్రితం సిద్దేశ్వరస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసినట్లు వివరించారు. గుప్తనిధుల కోసం ఆలయం వద్ద చేసిన తవ్వకాల సమాచారాన్ని గ్రామస్తులు పోలీసులకు అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని గుప్తనిదుల తవ్వకాలపై విచారణ చేపట్టారు. పురాతన ఆలయమైన సిద్దేశ్వరస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం గుంతలు తవ్వకాలు జరపడం సంచలనంగా మారింది. ఇప్పటికైన మండలంలోని పురాతన ఆలయాల పరిరక్షణకు అవసరమైన భద్రతను కల్పించాలని ప్రజలు కోరారు.

## రోడ్డుప్రమాదంలో బాలికకు తీవ్రగాయాలు



**వెలుగోడు,జనవరి6,ప్రభాతవార్త :** వెలుగోడు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద జరగిన రోడ్డు ప్రమాదంలో దోర్నాలకు చెందిన రాజేశ్వరి అనే బాలికకు తీవ్రగాయాలు అయ్యాయి.బాలిక శుక్రవారం రోడ్డు దాటుతుండగా గుజరాత్‌కు చెందిన యాత్రికుల బస్సు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తీవ్రగాయాలు అయ్యాయి.గాయపడ్డ బాలిక రాజేశ్వరిని మెరుగైన వైద్యచికిత్స ల నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.జరిగిన సంఘటనపై ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె,జనవరి6,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి,మీరాపురం గ్రామ వైసీపీ యువనాయకులు యమ్మనూరు మనోహర్‌రెడ్డిలు 2023 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు.యాగంటి దేవస్థానం పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు,మీరాపురం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను కళ్లకు కనపడేటట్లుగా క్యాలెండర్‌లో ప్రచురించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముందుగా కేక్‌కట్ చేసి అనంతరం ఆయనకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు బండి జగదీశ్వరరెడ్డి,బత్తుల రాంమోహన్‌రెడ్డి,బత్తుల వెంకట్రామిరెడ్డి,మల్లికార్జునరెడ్డి,మాధవరెడ్డి,బుసాని సుబ్బారెడ్డి,వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు శ్రమిస్తా

- వైకాపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంధే విక్రమ్‌కుమార్



**కోడుమూరు,జనవరి 6, ప్రభాతవార్త ః** కోడుమూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు శ్రమిస్తానని రాష్ట్ర వైకాపా కార్యవర్గ సభ్యులు సంధే విక్రమ్‌కుమార్ హామిచ్చారు. శుక్రవారం ఆయన కర్నూలు మండలంలోని ఆయా కాలనీలలోని ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగ పరిశీలించారు. అనంతరం ఆయన టీవీ9 కాలనీలలో పర్యటించారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించేందుకు కోట్ల హర్ష నాయకత్వాన వాటిని వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానన్నారు. నిత్య జీవితంలో ప్రజలకు తలెత్తే సమస్యల గురించి తన దృష్టికి తెచ్చిన వెంటనే వాటి పరిష్కారం కోసం అలుపెరగకుండా శ్రమించడమే గాక ప్రజలు పిలిచిన వెంటనే వారి ముంగిట ఉంటానన్నారు. అదే విధంగా ఆయన గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో దీర్ఘకాలికంగా ఆనారోగ్యంతో ఉన్న వైకాపా కార్యకర్త అశోక్‌కి ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు అందించే పథకాల వల్ల వారంతా ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారని సంధ్యే విక్రమ్ కుమార్ అన్నారు. రాజకీయాలకతీతంగా వైకాపా ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలోకి తీసుకెళ్తామన్నారు. ఈయన వెంట గుడిపాడు ఉప సర్పంచు వెంకటరాముడు వైకాపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా యల్లటూరు అరుణ

**కల్లూరు,జనవరి6,ప్రభాతవార్త:** కర్నూలు నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులురాలిగా ఎల్లటూరు అరుణను నియమించినట్లు రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్,మధుకర్‌జీ అలాగే బీజేపీ రాష్ట్ర అధ ్యక్షులు సోమువీర్రాజు మరియు రాష్ట్ర కార ్యదర్శి గీతా మాధురిలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అరుణారెడ్డి గతంలో కర్నూలు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఉండేవారని ఆమె పార్టీ బలోపేతానికి విశేషంగా కృషిచేసి పట్టుదలతో ముందుకు తీసుకువెళ్లేవారన్నారు.అలాగే పార్టీ ఆమె శ్రమను గుర్తించి పార్టీ ఉన్నతశ్రేణులు అరుణారెడ్డికి ఉన్నత పదవి ఇస్తే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తుందని భావించి వారికి మహిళా మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులురాలిగా ఉన్నత పదవి కల్పిస్తు రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని వారు ఆదేశించారు.అలాగే అరుణారెడ్డి మాట్లాడుతూ నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని,తాను ఎప్పుడు పార్టీ కోసం ఎల్లవేళలా కష్టపడుతూ రానున్న రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తానని ఆమె తెలిపారు.


**KURNOOL MUNICIPAL CORPORATION**

e-Procurement Notice

Tender Notice No.62-1 to 62-8/General Funds/EE&SE/Knl/22-23, dt.03-01-2023 (Short Tender) & Tender Notice No.62-19 /General Funds/EE&SE/Knl/22-23, dt.03-01-2023

| Name of the Scheme | General Funds (Short Tender) | General Funds |
|---|---|---|
| No of works | 08 | 11 |
| Bid document download starting date | 09/01/2023 at 5:30 P.M | 10/01/2023 at 5:30 P.M. |
| Bid document download end date | 16/01/2023 at 4:00 P.M | 28/01/2023 at 4:00 P.M. |
| Last Date & Time for receipt of Bids | 16/01/2023 at 5:30 P.M | 28/01/2023 at 5:00 P.M. |
| Commercial Bid Opening Date | 16/01/2023 at 5:30 P.M | 28/01/2023 at 5:30 P.M. |

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in

A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

For Contact 9849908497, 8008403996.

Sd/- A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

## నిజాలు నిర్భయంగా రాసే పత్రికల్లో వార్త దినపత్రికది..ప్రత్యేక స్థానం..!





**ఆలూరు,జనవరి 6,ప్రభాతవార్త :** నిజాలు నిర్భయంగా రాసే పత్రికల్లో వార్త దినపత్రిక ది..ప్రత్యేక స్థానమని..ఆలూరు ఎంపిపి కురువ శ్రీరాములు,ఎంపిడిఓ అల్లాబకాష్,సెబ్ సిఐ వెంకట్,సెబ్ ఎస్ఐ రాజశేఖర్,వాల్మీకి జిల్లా అధ్యక్షులు,ఆర్‌సిసి కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి ఎల్లార్తి అర్జున్‌లు అన్నారు. వార్త ఆలూరు ఆర్‌సి ఇంచార్జ్ హెచ్ విరుపాక్షి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం,సెబ్ కార్యాలయం నందు వారి చేతుల మీదుగా వార్త జాతీయ దినపత్రిక 2023నూతన క్యాలెండర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ వార్త దినపత్రిక ప్రజల మన్ననలు పొందిందన్నారు. రెండు రాష్ట్రాల్లో వార్త జాతీయ దినపత్రిక అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ప్రజల మదిలో ప్రత్యేకతను చాటుకుందన్నారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్త హొళగుంద రిపోర్టర్ ముదస్సర్,తుంబళబీడు సర్పంచ్ మల్లికార్జున,సూపరింటెండెంట్ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శశికళ,సెబ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు,మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలి- తహశీల్దార్'



మాట్లాడుతున్న తహశీల్దార్ ధోనీఆల్‌ఫ్రైడ్

**కొలిమిగుండ్ల, జనవరి 6, ప్రభాతవార్త :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సమగ్ర భూసర్వే పనులకు సహకరించాలని కొలిమిగుండ్ల తహశీల్దార్ ధోనీఆల్‌ఫ్రెడ్ పెర్కొన్నారు. శుక్రవారం స్థానిక కారాయ్యలంలో ఆయన మాట్లాడుతూ మొదటగా మండలంలో ఫైలెట్ ప్రాజెక్టు కింద తుమ్మలపెంట, కల్వటాల తదితర గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం ఈసర్వే చేపడుతున్నట్లు తహశీల్దార్ పెర్కొన్నారు. రైతులందరూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు ప్రసాద్‌రెడ్డి, గూడుభాయి తదితరులు పాల్గొన్నారు.

## వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన తెదేపా నాయకులు



**ఆదోని,జనవరి 6,ప్రభాతవార్త :** వార్త తెలుగు జాతీయ దినపత్రిక 2023నూతన క్యాలెండర్‌ను ఆదోని వార్త ఆర్‌సి ఇంచార్జ్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెదేపా సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు సూరం భాస్కర్‌రెడ్డి,మాన్వి దేవేంద్రప్ప,మాజీ తెదేపా ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ,మాజీ ఎల్‌ఎల్‌సి చైర్మన్ బసాపురం రామస్వామి, మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప,మైనార్టీ నాయకుడు సాదీరవూఫ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతికేళ్లుగా నిజాలు నిర్భయంగా ప్రచురణ చేస్తూ అటు పాఠకులు,ఇటు ప్రజల సమస్యలను పాలక పక్షానికి,అధికారులకు చేరవేస్తూ ఎప్పటికప్పుడు సరికొత్త కథనాలతో దూసుకుపోతుందన్నారు. వార్త పత్రిక పత్రికా రంగంలో ప్రత్యేకమైన ముద్ర వేసుకుని కత్తి కన్నా కలం గొప్పదని నిరూపించిందని వార్తక్యాలెండర్‌ను ఆవిష్కరణ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన టీచర్ సస్పెన్షన్

**నంద్యాల విద్య, జనవరి 6, ప్రభాతవార్త:** విధుల పట్ల అలసత్వం వహిస్తు అధికారుల సూచనలు పాటించకుండా విద్యాసంస్థలో అంతర్గత లహాలను సృష్టిస్తు విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడు డి వెంకటేశ్వర్లును సస్పెన్షన్ చేస్తు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారి వి రంగారెడ్డి ఉత్తర్వులు ఆర్‌సినం.5672/ఎ2/2022 మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వివరాల మేరకు ఆదోని మండలం కపాటి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న డి వెంకటేశ్వర్లును సస్పెన్షన్ చేశారు.ఈనెల 4వ తేదిన జిల్లా విద్యాశాఖాధికారి వి రంగారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఇతను హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు. ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజ్యూస్ ట్యాబ్స్ పంపిణి చేయలేదు. అతను ఎప్పుడు సిబ్బందితో పేరెంట్స్ కమిటీతో సఖ్యతగా ఉండకపోవడం, పరిపాలన పరంగా అనేక ల్యాప్స్ ఏర్పాడ్డాయి. అతని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూల్‌నం.3 మేరకు ఏపీ సివిల్‌సర్వీస్ కాండక్టు రూల్స్ 1964 మేరకు విధుల నుంచి సస్పెన్షన్ చేశారు. ఈసస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలం నందు నిబంధనల మేరకు ఉన్నతాధికారుల అనుమతిలేకుండా హెడ్‌క్వార్టర్‌ను విడువరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సంక్షేమపాలన అందిస్తున్న ఘనత జగనన్నదే-పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి

– రామళ్లకోటలో ఫించన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీదేవి

**వెల్దుర్తి,జనవరి6,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలందరికి సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(జగనన్న)దే అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.మండలంలోని కలుగోట్ల గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.గ్రామానికి చేరుకొన్న ఎమ్మెల్యే శ్రీదేవికి గ్రామ వైకాపా నాయకులు కలుగోట్ల జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు పూలు,మేళతాళాలు,బాణసంచాతో స్వాగతం పలికారు.ఆమె వైకాపా నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని గడపగడపకు తిరిగారు.జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.సంక్షేమపథకాల కరపత్రాలను ప్రజలకు ఆమె అందించారు.ముందుగా రామళ్లకోట గ్రామంలో గ్రామసర్పంచ్ నిర్మల అధ్యక్షతన పెంచిన ఫించన్లను ఎమ్మెల్యే శ్రీదేవి లబ్దిదారులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చిన గెలవలేమన్న భయం చంద్రబాబునాయుడుకు పట్టుకుందన్నారు.గత ప్రభుత్వం 39లక్షల ఫించన్లు ఇస్తుండగా వైకాపా ప్రభుత్వంలో 64లక్షల ఫించన్లు ఇస్తున్నామన్నారు.అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షపార్టీల నాయకులు గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.తెదేపా చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ,గ్రామ వైకాపా నాయకులు కలుగోట్ల జనార్థన్‌రెడ్డి,బ్రహ్మగుండం ఛైర్మెన్ బొమ్మనపెద్దిరెడ్డి,జడ్పీటిసి దాదిపోగు సుంకన్న,మాజీ జడ్పీటిసి సమీర్‌కుమార్‌రెడ్డి,సిఐ యుగంధర్,ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి, ఇఓఆర్డీ నరసింహులు,ఏఓ అక్బర్‌బాష,పిఆర్ ఏఇ సురేంద్రరెడ్డి,విద్యుత్ ఏఇ రాఘవేంద్రప్రసాద్‌పుల్లగుమ్మినాగార్జునరెడ్డి,రామళ్లకోట సర్పంచ్ నిర్మల,మాధవస్వామి,రాధాక్రిష్ణారెడ్డి,మాలిక్‌బాష,కలుగోట్ల రామాంజనేయులు, వెంకటేష్,క్రిష్ణుడు, సురేష్,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలుగోట్ల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవితో జనార్థన్‌రెడ్డి,ప్రజాప్రతినిధులు,నాయకులు

# టిడ్కో గృహాల చుట్టు నంద్యాల రాజకీయం



**నంద్యాల, జనవరి 6, ప్రభాతవార్త:** నంద్యాలలో టిడ్కో గృహాల చుట్టు రాజకీయం నడుస్తోంది. గత నాలుగురోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి టిడిపి అధ్వర్యంలో తన బాబాయ్ జయంతి సందర్భంగా పట్టణంలో సంజీవనగర్ సర్కిల్ నుంచి మీనాక్షి హోటల్‌మీదుగా టిడ్కో గృహాల వరకు భారీ ర్యాలీకి కార్యకర్తలతో ఏర్పాటు చేశారు. అయితే టిడిపికి ఊహించని షాక్ ఇచ్చింది వైసీపీ. ఈనెల 7వ తేదినే టిడ్కో గృహాలు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమానికి హాజరయ్యేందుకు అహ్వానాలు సైతం అందజేశారు. రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ శుక్రవారం టిడ్కో గృహాలను పరిశీలించి అన్ని గృహాలను మరమ్మత్తులుంటే చేపట్టాలని అధికారులకు అదేశాలు జారీచేశారు. పట్టణంలోని ఎస్ఆర్‌బిసి కాలనీ, వైయస్ఆర్‌నగర్, అయ్యలూరుమెట్ట వద్ద ఉన్న టిడ్కో గృహాలు లబ్దిదారులకిచ్చేందుకు రంగం సిద్దం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ దివంగత నేత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి జయంతి సందర్భానికి ముందే టిడ్కో గృహాలు ప్రారంభిచడం మంచి కార్యక్రమమే అని కార్యక్రమాన్ని గత సంవత్సరం కూడ నాగిరెడ్డి జయంతి 8వతేది సందర్భంగా టిడ్కో గృహాలను అందరికి పంచాలని దీక్ష, ర్యాలీ చేసినట్లు గుర్తుచేశారు. ఏవరికైతే లబ్దిదారులున్నారో వారందరికి డిప్ సిస్టం ద్వారా గృహాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతిఒక్క లబ్దిదారునికి అందేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. తూతుమంత్రంగా 500 మందికి, 1000 మందికి ఇచ్చి పంచామని చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఒక్కపైసా కూడ తీసుకోకుండా అర్హులైన లబ్దిదారులకు టిడ్కో గృహాలు అందించాలని డిమాండ్ చేశారు. 8వ తేది ర్యాలీకి ఎస్పీ అనుమతి కోసం వెళ్లగా 7వ తేదినే టిడ్కో గృహాలు పంపిణికి రంగం సిద్దంచేశారని తెలిపారని పేర్కొన్నారు. అర్హులైన లబ్దిదారులకు గృహాలు ఇవ్వనిపక్షంలో తదుపరి కార్యచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలో 8వ తేదిన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని అందుకు అనుమతులను కూడ కోరేందుకు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిశారు.

# వైభవంగా శ్రీ మహారుద్ర చండీయాగ మహోత్సవం



కోడుమూరులో నిర్వహించిన మహారుద్ర చండీ యాగ మహోత్సవ వేడుకల దృశ్యం

**కోడుమూరు,జనవరి 6, ప్రభాతవార్త :** స్థానిక ధర్మపురి క్షేత్ర శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి సన్నిధిలో శుక్రవారం జరిగిన శ్రీ మహారుద్ర చండీ యాగ మహోత్సవ వేడుకలు వేద పండితుల నడుమ వైభవంగా జరిగాయి. జిల్లాలోనే ప్రపథమముగా కోడుమూరులోని అయ్యప్పస్వామి భక్తుల ఆధ్వర్యంలో మహారుద్ర చండీయాగ హోమాలు జరిగాయి. ఎంతో విశిష్టత చెందిన చండీ యాగ కార్యక్రమాలు నిర్వహించడంతో పట్టణ ప్రజలంతా ఎంతో ఆకర్షించారు. ఈ వేడుకలు ఉదయం మధ్యాహ్నం వరకు స్వామి సన్నిధిలో భక్తి శ్రద్దలతో హోమాలు జరిగాయి. హోమాలను వేదపండితులైన రవిసింహ శాస్త్రీ,సుధీర్ స్వామి నేతృత్వంలో దాదాపు 700 వందల మంత్రాలతో 200 మంది దంపతులతో సామూహిక చండీయాగా హోమాలను నిర్వహించారు. మహా చండీయాగ హోమం కార్యక్రమాలకు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, వైకాపా మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టా రేణుక, కోడుమూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త,కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సినియర్ రాజకీయ నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డిలు హజరై వారు కూడా హోమంలో పాల్గొన్నారు. ఇలాంటి మహారుద్ర చండీయాగాలు నిర్వహించడం ద్వారా కోడుమూరు ప్రజలకు ఎల్ల వేళలా అంతా మంచి జరిగలానే లక్ష్యంతో శ్రీధర్మపురి శ్రీధర్మశాస్త్ర ఆలయ కమిటి వారు తలెపెట్టడం ప్రజలంతా హర్షించారు. ఇలాంటి యాగాలు ఎక్కడా జరగవు, అందుకే కోడుమూరులో జరిగిన చండీ యాగ హోమం కార్యక్రమాలకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి హోమం వేడుకలను తిలకించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వారు ఇక్కడకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నిర్వాహకులు భాస్కరరెడ్డి, చిట్టిబాబు, గంగాధర్,జీతూరి రవి, కాటెగారి గోపి, కిరణ్‌శెట్టి,మల్లి,ప్రకాష్,శివస్వాములు,బండ నాగరాజు, కాశన్న రవికుమార్, లద్దగిరి లక్ష్మన్న, కాశన్న రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ అంశాలపై దృష్టిపెట్టండి

–భూ రికార్డుల స్వచ్చీకరణ, సమస్యలు పరిష్కరించండి –జిల్లా కలెక్టరు



**నంద్యాల, జనవరి 6, ప్రభాతవార్త:** జిల్లా భూ తగాదా సమస్యలను పరిష్కరించి భూరికార్డుల స్వచ్చీకరణపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ ఆర్డీఓలను,మండల తహశీల్దార్‌లను అదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో విడియోకాన్ఫరెన్స్ జేసి నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. భూ అక్రమణలు, రెవిన్యూ రికార్డుల్లో సవరణలు, పట్టదారు పుస్తకాల మంజూరులో లోపాలు తదితర అంశాలపై ప్రజల నుంచి అధికంగా ధరఖాస్తులు వస్తున్నాయని వీటన్నింటిపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలని సూచించారు. స్పందన దరఖాస్తుల పరిష్కారానికి 39 రిఒపేన్ ధరఖాస్తులు విత్ఇన్ ఎస్ఎల్ఎలో 775 ధరఖాస్తులు, ఏపీ సేవా సర్వీసుల బియాండ్‌ఎస్ఎల్ఎలో 414 ధరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదేశించారు. జేసి నిశాంతి మాట్డాఉతూ రెవిన్యూ అంశాలపై తహాశీల్దార్‌లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 62 గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటికి సంబంధించి శ్మశాన వాటికలకు ప్రభుత్వ భూములను గుర్తించి సోమవారంలోగా ప్రతిపాదనలు పంపాలని అదేశించారు. అనర్హత కలిగిన లబ్దిదారులకుఇళ్ళ పట్టాలు మంజూరు చేస్తే విఆర్‌ఓలను, తహాశీల్దార్‌లను బాధ్యులనుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారులు 340సి, 340 బి, 167లకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని ఆమె అదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని, కట్మెంట్ కేసులు, ఫైనల్ అర్డర్ కేసులు,కొత్త కేసులపై పూర్తిస్థాయి దృష్టిసారించి వాటిని క్లియర్‌చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్వో పుల్లయ్య, డోన్ ఆర్డిఓ వెంకటరెడ్డితో పాటు తహాశీల్దార్‌లు పాల్గొన్నారు.

## ఫారంఫండ్ పనులను పరిశీలించిన డ్వామా పిడి

**వెల్దుర్తి,జనవరి6,ప్రభాతవార్త :** మండలంలోని మల్లెపల్లి,అల్లుగుండు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పిడి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఉపాధికూలీలతో పిడి మాట్లాడారు.వలసలు పోకుండా మీ గ్రామంలోనే పనులు చేసుకోవాలని సూచించారు.పనుల వివరాలను ఏపిఓ రాజునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.చెక్‌డ్యాం,అవెన్యూప్లాంటేషన్,ఫారంఫండ్ పనులను పిడి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏపిఓ రాజునాయక్‌తో పాటు ఇసి,టిఏలు,ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు



**వెల్దుర్తి,జనవరి6,ప్రభాతవార్త :** స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.విజిలెన్స్ సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఏఓ గణేష్ రికార్డులు పరిశీలించారు.ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్యపనులను,సిబ్బంది హాజరును చూశారు.రోగులకు అందిస్తున్న వైద్యసేవలను,మందులను అడిగి తెలుసుకున్నారు.కుక్కకాటు మందు రేబిస్ వ్యాక్సిన్ లేకపోవడం,పుల్లయ్య అనే వ్యక్తి బయట కొనుగోలు చేస్తున్నది వారు గుర్తించారు.ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు తొందరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్.బాలచంద్రారెడ్డికి వారు సూచించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది జిలాని బాష తదితరులు పాల్గొన్నారు.

**--పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన లీగల్ మెట్రాలజీ అధికారులు** వెల్దుర్తి పట్టణంలోని రెండు బంకుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు.అసిస్టెంట్ కంట్రోల్ అధికారి ఈశ్వరరావు,అన్నమయ్య,జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజులు పెట్రోల్,డీజిల్,నాణ్యత పరిమాణాలను వారు పరిశీలించారు.పంపుల ద్వార వాహనదారులకు అందిస్తున్న 5లీటర్ల ఇంధనాన్ని తీసుకొని వారు తనిఖీ చేశారు.వినియోగదారుడికి నష్టం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## నూతన పెన్షన్లు పంపిణీ

**మద్దికెర,జనవరి 6,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు శుక్రవారం జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి,ఎంపిపి అనిత యాదవ్,వైస్ ఎంపిపి కాకర్ల మహేశ్వర్‌రెడ్డిల చేతుల మీదుగా లబ్దిదారులకు పించన్లు పంపినీ చేశారు. ఎంపిడిఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్లు తీసేశారని ప్రచారం చేస్తున్నారనే అపోహ వద్దు..అవి రీ వెరిఫికేషన్ చేసి అర్హులు అయితే కచ్చితంగా మళ్లీ అలాగే ఉంచుతామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే సిఎం జగన్ లక్ష్యమన్నారు. మద్దికెరలో 61,మండలం మొత్తం మీద 150కి పైగా నూతన పెన్షన్లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ప్రమీళమ్మ,మాజీ ఎంపిటిసి దొనిపిగారి శ్రీనివాసులు,ఎంపిటిసిలు రామకృష్ణారెడ్డి,కాల్వ రామకృష్ణ,ముస్తురు రామాంజులు,పంచాయతీ సెక్రటరీ రాధా,అనూషా,కరుణ,వెల్ఫేర్ అసిస్టెంట్ మహేంద్ర,శశికళ,డిజిటల్ అసిస్టెంట్ ఆదినారాయణ,పెన్షన్‌దారులు,వాలంటరీలు,ప్రజలు పాల్గొన్నారు.



## నిరుపేదల ఆరోగ్యానికి భరోసా



బాధితునికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

**నందవరం, జనవరి 6, ప్రభాతవార్త:** నిరుపేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తుందని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎ ర్రకోట చెన్నకేశవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిచింత గ్రామానికి చెందిన తలారి రామాంజనేయులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 1,25,000 రూపాయలు విలువగల చెక్‌ను గ్రామ వైసీపీ నాయకులు సురేష్‌గౌడ్ అధ్వర్యంలో ఎమ్మెల్యే పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తుచేసుకున్న లబ్దిదారులకు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమ విషయంలో పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధనుర్మాస ఉత్సవాల్లో కోరికలు తీర్చే వెంకటేశ్వస్వామికి అష్టోత్తర కలశం



**నంద్యాల హౌస్పటల్, జనవరి 6, ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారం కలియుగ ప్రత్యక్షదైవమయిన శ్రీవెంకటేశ్వరస్వామికి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అష్టోత్తర కలశ స్థపనం నిర్వహించారు. పట్టణంలోని రామాలయంలో శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే అష్టోత్తర కలశస్థపనం డా.దీవి హైగ్రీవాచార్యుల విశ్లేషణతో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ అచార్యకత్వంలో తరుణ్‌శర్మ ఇతర అర్చకులు వేదమంత్రోశ్చరణతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలను పూజకు వచ్చిన భక్తులు దర్శనం చేసుకున్నారు. అలంకరణ అనంతరం ధనుర్మాసంలో నిత్యం జరిగే శ్రీవిష్ణు సహస్రనామార్చనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులైన సముద్రాల సూరయ్య, వంకదార మధుసూధన్‌రావు, మాఘం గురు ప్రసాద్, నరాల జయచంద్రారెడ్డి, దేవరశెట్టి శ్రీనివాస్, జయప్రకాష్, యిసనక్రర వెంకట సుబ్బ సత్యనారాయణ, సురేంద్రమోహన్, చక్రపాణి, వసంతరాఘవ ప్రభు, నవీన్‌కుమార్, చాటకొండశ్రీకాంత్, తులసి కృష్ణ, పార్థసారధి కృష్ణ, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, హరినాథ్‌లతో పాటు పలువురు భక్తులు తీర్థప్రసాదాల్లో పాల్గొన్నారు.

## శుక్రవారంనాడు పుష్యశుద్ధ పౌర్ణమి



శ్రీగిరి ప్రదక్షిణిలో ఈఓ,అర్చకస్వాములు శ్రీశైల గిరి ప్రదక్షిణ

**శ్రీశైలంప్రాజెక్టు,జనవరి06,ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంలో శుక్రవారంనాడు పుష్యశుద్ధ పౌర్ణమి సందర్భంగా దేవస్థానం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమం సంప్రదాయబద్దంగా నిర్వహించడం జరిగింది.శ్రీస్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేపు చేయించి ప్రత్యేక పూజలు జరిపించబడ్డాయి.తరువాత శ్రీస్వామి అమ్మవార్ల పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరిప్రదక్షిణ ప్రారంబం కావడం జరిగింది.ఆలయ మహద్వారం నుండి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం,అంకాళమ్మ ఆలయం,నందిమండపం,గంగసదనం వలయదారి మీదుగా తదితర ప్రాంతాలను కలియ తిరిగి అనంతరం శ్రీగిరిప్రదక్షిణ ముగిసింది.అదే విధంగా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదక్షిణను నిర్వహించడం జరిగింది.గిరిప్రదక్షిణ అనంతరం భక్తులకు ప్రసాదవితరణ చేయడం జరిగింది.శ్రీగిరి ప్రదక్షిణలో శ్రీశైలందేవస్థానం ఈఓ ఎస్.లవన్న,పర్యవేక్షకులు అయ్యన్న,మదుసుదన్‌రెడ్డి,అరచకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బియ్యంపై విజిలెన్స్ దాడులు



**మద్దికెర,జనవరి 6,ప్రభాతవార్త :** ప్రభుత్వ బియ్యం అక్రమ రవాణ జరుగుతుండడంతో విజిలెన్స్ అధికారులు అడ్డుకట్ట వేషారు. వివరాల్లోకి వెళితే మండలంలో విచ్చలవిడిగా బియ్యం అక్రమ రవాణా జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గతంలో ఏకంగా పోలీస్ డిపార్ట్మెంట్‌కి చెందిన కొందరు బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని వదిలేసి డిపార్ట్‌మెంట్ వారు బలైన సంఘటనలూ ఉన్నాయి. అయితే ఈ మద్యకాలంలో మండలంలో అధికంగా బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అధికారులు కూడా ఇందులో భాగస్వాములై ఉన్నారా..లేక పార్టీ నాయకులు..కార్యకర్తలు..ఉన్నారా..అనే విషయం తెలియాల్సి ఉంది. శుక్రవారం మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న బిఎన్ పేట గ్రామం సమీపంలో సుమారుగా 300ప్యాకెట్లకుపైగా విజిలెన్స్ అధికారులకు బియ్యం ప్యాకెట్లు లభించినట్లు సమాచారం. ప్రతిరోజు మండలంలో ఉన్నటువంటి ప్రజల వద్ద నుండి బియ్యంను రూ.10ల నుండి రూ.12ల వరకు కొనుగోలు చేసి ఒకచోట చేర్చి సుదూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై స్థానికంగా ఉన్న తహశీల్దార్‌ని వివరణ కోరగా సమాచారం అయితే తెలిసింది కానీ మరిన్ని వివరాలు రావాల్సి ఉందని తెలిపారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

**ఆదోని,జనవరి 6,ప్రభాతవార్త :** అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం పట్టుకున్నట్లు సిఐ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం 3గంటల సమయంలో సెబ్ అధికారులు ఆలూరు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి గుర్తుతెలియని వ్యక్తి తన కారులో 50బాక్సులు,ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీని రవాణా చేస్తూ సెబ్ అధికారులను చూసి కారును వదిలి పారిపోవడం జరిగిందని సిఐ తెలిపారు. కారు,మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ శివప్రసాద్,సిబ్బంది వున్నారు.



పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న సెబ్ అధికారులు